సాక్షి ఒడిశా

ఆదివారం । 11 । మే । 2025




శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 4,84,596
బంగారం : 840 మిల్లీ గ్రాములు
వెండి : 9 గ్రాముల 800 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



లోక్ అదాలత్‌కు స్పందన

రాష్ట్రవ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. వేలాది కేసులు పరిష్కారమయ్యాయి. - 10లో



రైల్వే జీఎం పర్యటన

ఈస్ట్ కోస్ట్ జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంకువాల్ కొరాపుట్ రైల్వే లైన్‌లో శనివారం పర్యటించారు. - 10లో

న్యూస్‌రీల్

మండుతున్న ఎండలు

భువనేశ్వర్: కాల వైశాఖి కనుమరుగు కావడంతో రాష్ట్రం అంతటా వేసవి తాపం ఊపందుకుంది. శనివారం ఉదయం 11.30 గంటలకు కొన్ని చోట్ల గరిష్ట ఉష్ణోగ్రత 39 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. సంబలపూర్‌లో గరిష్టంగా 39.2 డిగ్రీ ఉష్ణోగ్రత నమోదు కాగా, ఝార్సుగుడలో 38.8, హీరాకుద్‌లో 38.6, బాలాసోర్‌లో 37.8, రౌర్కెలాలో 37.6, భువనేశ్వర్‌లో 36.8 డిగ్రీలు చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సాయుధ దళాలకు అభినందనలు

భువనేశ్వర్: భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ ప్రకటనను విపక్ష నేత నవీన్ పట్నాయక్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదంపై భారతదేశం రాజీలేని వైఖరిని ప్రశంసించారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను, ఉగ్రవాదానికి మద్దతు ఇచ్చే మౌలిక సదుపాయాలను కూల్చివేసిన భారత సాయుధ దళాలకు అభినందనలు తెలిపారు.

జోరుగా తారురోడ్డు నిర్మాణం



జైల్ రోడ్డు నుంచి పోలీసుస్టేషన్ వరకూ తారురోడ్డు వేస్తున్న అధికారులు

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని ఫారెస్టు గేటు నుంచి పాత బస్టాండు, కొత్త బస్టాండు మీదుగా పాత కోర్టు జంక్షన్ వరకూ రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో తారు రోడ్డు పనులు జోరుగా సాగుతున్నాయి. రోడ్డు పనులు చేపట్టాలని స్థానిక ప్రజలు ప్రజా ప్రతినిధులు, అధికారులకు అనేకమార్లు విన్నపాలు చేశారు. ఎట్టకేలకు శనివారం నుంచి తారురోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. అలాగే పెద్ద బ్రాహ్మణవీధి నుంచి కొత్త బస్టాండు వరకూ ఆక్రమణల తొలగింపునకు పీ డబ్ల్యూడీ ఇంజినీర్లు కొలతలు తీస్తున్నట్టు అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు తెలిపారు. సుమారు రూ. 9 కోట్లతో రోడ్డు పనులు జరుగుతున్నాయని ఎస్ఈ అభిషేక్ శెఠి తెలిపారు.

మహిళ దారుణ హత్య



విలపిస్తున్న సత్యవతి బంధువులు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి దొరాపుట్ గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. రెండో భార్య చేతిలో మొదటి భార్య దారుణ హత్యకు గురైంది. బొయిపరిగుడ పోలీసు అధికారి రశ్మీరంజన్ ప్రధాన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దొరాపుట్ గ్రామానికి చెందిన బినోద్ బారిక్‌కు ఎనిమిదేళ్ల కిందట ఘుమర పంచాయతీ అటుగుడ గ్రామానికి చెందిన సత్యవతితో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. బినోద్ దొండొటడి గ్రామంలో బైజయంతి అనే యువతిని ప్రేమించి రెండో పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు భార్యలతో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాడు. కొన్నాళ్లు ఇద్దరి భార్యల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం వేకువజామున 4 గంటల సమయంలో గర్భిణిగా ఉన్న సత్యవతిపై బైజయంతి గొడ్డలితో దాడి చేసింది. గమనించిన స్థానికులు సత్యవతిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న సత్యవతి కన్నవారు బొయిపరిగుడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దొరాగుడ వెళ్లి బైజయంతిని అరెస్టు చేశారు.

హ్యాండ్ బ్యాగ్ అప్పగింత



బ్యాగును అప్పగిస్తున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

రాయగడ: స్టేషన్ వచ్చిందని కంగారుగా దిగిపోయారు. తీరా చూస్తే తమతో తీసుకువచ్చిన హ్యాండ్ బ్యాగ్‌ను ట్రైన్‌లో మరిచిపోయారు. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. విశాఖపట్నం నుంచి పార్వతీపురానికి ఒక కుటుంబం ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నారు. పార్వతీపురం రైల్వే స్టేషన్ రాగానే హ్యాండ్ బ్యాగ్‌ను మరిచి దిగిపోయారు. అనంతరం బ్యాగ్ ట్రైన్‌లో మరిచినట్లు గుర్తుకు రావడంతో వెంటనే పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో గల ఆర్పీఎఫ్ సిబ్బందికి బాధితుడు కె.ప్రేమ కుమార్ ఫిర్యాదు చేశారు. ఆర్పీఎఫ్ సిబ్బంది రాయగడ రైల్వే స్టేషన్‌కు సమాచారం అందించారు. బాధితులు ప్రయాణించే కోచ్ నంబర్ ఎస్-4ను తనిఖీ చేయగా బ్యాగ్ లభించలేదు. అనంతరం మునిగుడ ఆర్పీఎఫ్‌కు సమాచారం అందించడంతో అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది కోచ్‌ను వెతకగా అందులో బ్యాగ్ లభించింది. బ్యాగ్‌లో గల 21 గ్రాముల బంగారు పుస్తుల తాడు, రూ.500 నగదు, మొబైల్ చార్జర్‌ను బాధితులకు ఆర్పీఎఫ్ సిబ్బంది అప్పగించారు.

అడుగడుగునా నిఘా



సముద్ర మార్గంలో కదలికలపై నిఘా

- భారత్, పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రత పెంపు
- రాష్ట్ర తీర ప్రాంతాల్లో మోహరించిన భద్రతా దళాలు
- డీజీ క్యాంపు కార్యాలయంలో ఉన్నత స్థాయి సమావేశం



సముద్రంలో సాయుధ దళాల భద్రత



తీర ప్రాంతం నిఘాలో భద్రతా సిబ్బంది

భువనేశ్వర్: భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు నేపథ్యంలో రాష్ట్రం అప్రమత్తమైంది. స్థానికంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా దళాలు నిఘా పెంచాయి. సరిహద్దు జల మార్గాల గుండా ఉగ్రదవాద దాడులకు ఏమాత్రం అవకాశం లేకుండా సమగ్ర యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. తీర ప్రాంతంలో పోలీసులు, తీరప్రాంత భద్రతా సంస్థలు కసరత్తులు నిర్వహిస్తున్నాయి. కీలకమైన ప్రజా స్థావరాల వద్ద భద్రతను పెంచాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర పోలీసులు రాత్రింబవళ్లు గస్తీ అమలు చేశారు. ప్రజలకు భద్రత కల్పించడానికి ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటామని భద్రతా దళాలు అభయమిస్తున్నాయి. పూరీ పోలీసులు సముద్ర గస్తీ నిర్వహిస్తున్నారు. ట్రాలర్ తనిఖీలతో అనుమానితుల్ని ప్రశ్నిస్తున్నారు. ఉగ్రవాద దాడి నిరోధించేందుకు సర్వ సన్నద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు.

ఉన్నత స్థాయి సమావేశం..

ఒడిశాలో తీరప్రాంత భద్రతపై శనివారం ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. రాష్ట్ర పోలీసు డైరెక్టరు జనరల్ అధ్యక్షతన ఆయన క్యాంప్ కార్యాలయంలో అదనపు డైరెక్టరు జనరల్ ఏడీజీ అరుణ్ బోత్రాతో శాంతి భద్రతల ఏడీజీ, కేంద్ర ఇనస్పెక్టర్ జనరల్, జంట నగరాల పోలీసు కమిషనరు హాజరై భద్రతపై చర్చించారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల ఏడీజీ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రవేశ కేంద్రాల్ని హై అలర్ట్ పరిధిలోకి తీసుకున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో 511 కిలో మీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం పొడవునా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. తీర ప్రాంతాల్లో డ్రోన్ దాడులు జరగకుండా నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో రాక్ డ్రోన్లు ఎగరలేవని, ఈ పరిస్థితి దృష్టికి వచ్చిన వెంటనే చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సైనిక స్థావరాల భద్రత రెట్టింపు చేసినట్లు వివరించారు.



జల మార్గంలో చొరబాట్లపై కొనసాగుతున్న నిఘా



సముద్రంలో ట్రాలర్ల తనిఖీ

• సాయుధ దళాలకు వందనం



ఇంట్లో తల్లీ బిడ్డలు సురక్షితంగా నిద్రపోయేలా చేసిన భారత సాయుధ దళాల ధైర్యానికి వందనం చెబుతూ ఆపరేషన్ సిందూర్‌లో భారత సాయుధ దళాల పరాక్రమం ప్రతిబింబించే అద్భుత సైకత కళాకృతి పూరీ సాగర తీరంలో ఆవిష్కారమైంది. పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ సైకత శిల్పం సందర్శకుల మనసు దోచుకుంది. - భువనేశ్వర్

స్కౌట్స్, గైడ్స్‌కు రాష్ట్రపతి పురస్కారం



గవర్నర్ నుంచి పురస్కారం అందుకుంటున్న స్కౌట్స్, గైడ్ టీచర్ సురేంద్ర కుమార్ పాత్రో, డీఈవో డాక్టర్ మాయాధర్ సాహు

పర్లాకిమిడి: గజపతి జిల్లా భారత్ స్కౌట్స్, గైడ్స్ వింగ్‌కు అరుదైన గౌరవం దక్కింది. 2025 ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్రపతి వార్డు వరించింది. దీన్ని ఈనెల తొమ్మిదో తేదీన ఒడిశాలోని రాజభవన్‌లో హాల్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ హరిబాబు కంభంపాటి అందజేశారు. గజపతి జిల్లా స్కౌట్స్, గైడ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న భారత్ స్కౌట్స్ ఆఫీసర్ సురేంద్రకుమార్ పాత్రో, డీఈవో డాక్టర్ మాయాధర్ సాహులు రాష్ట్రపతి అవార్డును అందుకున్నారు. రాష్ట్రపతి అవార్డు ప్రదాన కార్యక్రమంలో గవర్నర్ సతీమణి జయంతీ కంభంపాటితో పాటు రాష్ట్ర ఉన్నతవిద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, విద్యాలయ గణశిక్షామంత్రి నిత్యానంద గోండ్, రాష్ట్ర ముఖ్యకమిషనర్ కాశీప్రసాద్ మిశ్రో, దేవీప్రసాద్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. గజపతి జిల్లాకు రాష్ట్రపతి పురస్కారం రావడం ఇది మూడోసారని డీఈవో డాక్టర్ మాయాధర్ సాహు తెలిపారు.

బ్యాంక్ సేవలపై సమీక్ష



బ్యాంకు సేవలపై చర్చిస్తున్న అధికారులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కొట్‌పాడ్ సమితిస్థాయి బ్యాంకర్స్ కమిటీ సమవేశం శనివారం జరిగింది. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించటంతో పాటు లబ్ధిదారులకు పథకాల ఫలితాలు ఎలా చేరుతున్నది, సబ్సిడీ పొందుతున్నారా లేదా, రుణాన్ని సకాలంలో లబ్ధిదారులు చెల్లిస్తున్నారా లేదా అనే విషయాలపై కమిటీ చర్చించింది. కొట్‌పాడ్ బ్లాక్ మేనేజ్‌మెంట్ యూనిట్ అధికారి గుప్త ప్రసాద్ మరిఖ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమితి బీడీవో బిక్రమ కుమార్ దొర, సమితి చైర్మన్ కమళ లోచన భొత్ర, కొట్‌పాడ్ సమితి స్థాయి బ్యాంకర్ల కమిటీ వైస్ చైర్మన్ తపన కుమార్ పాణిగ్రహి, ఐపీవో నిరంజన్ పండ, తాపస దాస్, దేవీ ప్రసాద్ త్రిపాఠీ, కొరాపుట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ (ఎల్‌డీఎం) డి.కె.త్రిపాఠీ, జీపీవో కేధార్ నాథ్ అటక, సువర్ణ నాయిక్, బిమళావతి సమరత్, రంజిత నాయిక్, ఉజ్వళ ఆశా, నిర్మళ, దన్‌ఫూల్, నమిత నాయిక్‌తోపాటు తొమ్మిది బ్యాంకుల పరిపాలన అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

త్వరగా మా ఇంటికి చేర్చండి

- శ్రీనగర్‌లో చిక్కుకున్న వ్యవసాయ విద్యార్థులు
- సురక్షితంగా స్వస్థలాలకు చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి వినతి
- అభయమిచ్చిన సీఎం మాఝి



రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై జమ్ము నుంచి తరలి వచ్చిన విద్యార్థులను స్వాగతించిన రాష్ట్ర రవాణా శాఖ అధికారులు



జమ్మూ నుంచి బాలాసోర్ సురక్షితంగా చేరిన విద్యార్థితో రవాణా శాఖ సిబ్బంది

భువనేశ్వర్: భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో చిక్కుకున్న ఒడిశా ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వీరిని సమస్యాత్మక ప్రాంతాల నుంచి సురక్షితంగ తరలిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అభయమిచ్చారు. ఈ మేరకు శనివారం నుంచి భారత్, పాక్ సరిహద్దు ప్రాంతాల నుంచి విద్యార్థులు రాష్ట్రానికి చేరడం ఆరంభమైంది. ఈ క్రమంలో రాష్ట్రానికి చెందిన ఐదుగురు వ్యవసాయ శాస్త్ర విద్యార్థులు శ్రీనగర్‌లో చిక్కుకున్నారు. తమను శ్రీనగర్ నుంచి తక్షణమే ఢిల్లీకి తరలించాలని అభ్యర్థించారు. శ్రీనగర్‌లో పరిస్థితి క్షణక్షణం భయానకంగా మారుతుందని, తక్షణమే ఈ ప్రాంతం నుంచి సొంత రాష్ట్రానికి తరలించాలని ఢిల్లీ ఒడిశా భవన్ సంప్రదించారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల విద్యార్థులు హాస్టల్ నుండి వెళ్లిపోయారని, తమను కూడా తీసుకెళ్లాలని అభ్యర్థిస్తున్నారు. ఇప్పటి వరకు జమ్మూలోని 114 మంది ఒడియా విద్యార్థులను ఒడిశాకు తిరిగి తీసుకురావడానికి ఏర్పాట్లు చేశారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేసింది. ఢిల్లీలోని ఒడిశా భవన్ సంప్రదింపుల కోసం 7428135044, 011-24679201 ఫోను నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సొంత ఊరికి రవాణా..

ప్రభుత్వ సూచనల మేరకు జమ్మూకాశ్మీర్ నుంచి తిరిగి వస్తున్న ఒడియా విద్యార్థులకు రాష్ట్ర వాణిజ్య, రవాణా శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. శనివారం తేజస్ రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో సమస్యాత్మక జమ్మూ ప్రాంతం నుంచి బాలసోర్ రైల్వే స్టేషనుకు తిరిగొచ్చిన విద్యార్థులను వారి వారి గమ్యస్థానాలు చేరుకోవడానికి రాష్ట్ర రవాణా శాఖ ఏర్పాట్లు చేసిందని విభాగం ప్రముఖ కార్యదర్శి ఉషా పాఢి తెలిపారు.

గుణుపూర్ జీఐఈటీలో అగ్ని ప్రమాదం

- రు.కోటి విలువైన కంప్యూటర్ పరికరాలు దగ్ధం
- నిలిచిపోయిన ఓజేఈఈ పరీక్షలు



దగ్ధమైన కంప్యూటర్ గది



జీఐఈటీ భవనంలో పొగలు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



ప్రమాదానికి గురైన అడ్మినిస్ట్రేటివ్ భవనం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (జీఐఈటీ) విశ్వవిద్యాలయంలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. వర్సిటీ ప్రాంగణంలోని అడ్మినిస్ట్రేటివ్, కంప్యూటర్ ల్యాబ్‌లలో మంటలు చెలరేగడంతో సుమారు కోటి రూపాయల విలువైన కంప్యూటర్లు, ఇతర పరికరాలు దగ్ధమయ్యాయి. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం సంభవించిందని ప్రాథమిక దర్యాప్తులో అంచనా వేస్తున్నారు. శనివారం ఇదే వర్సిటీలో ఓజేఈఈ పరీక్షలు జరగాల్సి ఉంది. సరిగ్గా పరీక్షకు 20 నిమిషాలు ముందు అగ్ని ప్రమాదం సంభవించడంతో ఎగ్జామ్ రద్దు చేశారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తొలుత కంప్యూటర్ విభాగంలో దట్టమైన పొగలు రావడంతో అగ్ని ప్రమాదం సంభవించినట్లు గమనించిన సిబ్బంది వెంటనే విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎస్.వి.జె.రావుకు సమాచారం తెలియజేశారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సుమారు నాలుగు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే కంప్యూటర్ విభాగం అగ్నికి ఆహుతయ్యింది.

హేమలతకు శాంతిదూత అవార్డు



శాంత దూత అవార్డు ప్రదానోత్సవంలో ప్రసంగిస్తున్న గవర్నర్ హరిబాబు



మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న డి.హేమలత

భువనేశ్వర్: బలమైన దేశాన్ని నిర్మించడంలో మహిళల పాత్ర అనిర్వచనీయమని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి కొనియాడారు. ప్రపంచ మాతృ దినోత్సవం పురస్కరించుకుని శనివారం నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాత్రికేయం, సామాజిక సేవ, ఆరోగ్య సంరక్షణ, మహిళా అవగాహన, విద్య, క్రీడలు తదితర రంగాల్లో అత్యుత్తమ కృషి చేసిన 10 మంది మహిళలకు శాంతిదూత అవార్డుతో సత్కరించారు. ఈ క్రమంలో మారుమూల మల్కన్‌గిరి ప్రాంతంలో గృహిణిగా ఉంటూనే పాత్రికేయ రంగంలో రాణిస్తున్న డబ్బీరు హేమలత శాంతిదూత అవార్డు అందుకున్నారు. ప్రధానంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో కొండ కోనల్లో సంక్లిష్ట వార్తల సేకరణతో సామాజిక చైతన్యానికి దోహదపడుతున్నందుకు గాను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహక సంస్థ మా ఘెురొ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు రుతుపూర్ణ మహంతి తెలిపారు. కార్యక్రమంలో న్యాయ, అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, అడ్వకేటు జనరల్ పీతాంబర ఆచార్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం చంద్రబాబుకు మహిళలంటే చిన్నచూపు

● ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ నాయకుడు లక్ష్మణరావు



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సీఎం చంద్రబాబుకి మహిళలంటే చిన్న చూపు అని ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ నాయకుడు, వైఎస్సార్ సీపీ కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఏఐబీసీఎఫ్ నాయకురాలు, మాజీ మంత్రి విడదల రజనీపై పోలీసులు వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. రాష్ట్రంలో మాజీ మంత్రి స్థాయి వ్యక్తికే సరైన సమాధానం చెప్పలేని పరిస్థితిలో పోలీసు యంత్రాంగం, కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఇదేనా ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానమని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇటువంటి పరిస్థితులు కొనసాగిస్తే ఆల్ ఇండియా బీసీ ఫెడరేషన్ తరుపున ఉద్యమించక తప్పదని హెచ్చరించారు.

సత్తాచాటిన కంచిలి యువతి



అమెరికన్ యూనివర్సిటీ మాస్టర్ డిగ్రీతో జైనబ్ ఖానం

కంచిలి: మండల కేంద్రానికి చెందిన తాజుద్దీన్ ఖాన్ కుమార్తె జైనబ్ ఖానం అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ఉన్న ప్రతిష్టాత్మక అమెరికన్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసింది. దీంతో అదే యూనివర్సిటీలో అధ్యాపకురాలిగా కూడా సేవలందిస్తోందని తండ్రి తాజుద్దీన్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జైనబ్ ఖానం విద్యలో చూపిన ప్రతిభకు గుర్తింపుగా స్కాలర్‌షిప్ అందుకున్నారు. డేటా సైన్స్, మిషన్ లెర్నింగ్, డేటా అనాలిటిక్స్ వంటి అత్యాధునిక రంగాల్లో ప్రావీణ్యం సాధించారు. ఒక గ్రామీణ ప్రాంత యువతిగా అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత విద్యను అభ్యసించి, అదే విద్యాసంస్థలో అధ్యాపకురాలిగా మారడం విశేషం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటన స్థలంలో దశరథ మృతదేహం

టెక్కలి రూరల్: మండలంలోని శ్యామసుందరాపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నందిగాం మండలం ఆర్‌జే బొడ్డపాడు గ్రామానికి చెందిన బుడ్డ దశరథ(43) అనే వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు దశరథ కోటబొమ్మాళి మండలం గంగరాం గ్రామంలో జరిగిన వివాహ వేడుకకు శుక్రవారం వెళ్లాడు. అనంతరం తిరిగి శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై తన గ్రామానికి వెళ్తున్న క్రమంలో టెక్కలి సమీపంలోని శ్యామసుందరాపురం గ్రామ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. అయితే మృతుడికి మొదటి భార్య మృతి చెందడంతో ఇటీవలే రెండో వివాహం జరిగింది. మృతుడు వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. ఈయనకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



సురేష్ మృతదేహం

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో మూడో నంబర్ ప్లాట్‌ఫారం వద్ద శనివారం సాయంత్రం రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ ఎస్‌ఐ మధుసూదనరావు వివరాలు వెల్లడించారు. రేగిడి ఆమదాలవలస మండలం పుర్లె గ్రామానికి చెందిన రేగిడి సురేష్(28) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడు సురేష్ శ్రీకాకుళంలో ప్రైవేటు జాబ్ చేస్తున్నాడని, శుక్రవారం రేగిడి ఆమదాలవలసలో ఒక వివాహానికి హాజరై వస్తానని పనిచేసే వద్ద చెప్పి వెళ్లినట్లు సమాచారం. ఇంటికి వెళ్లి వచ్చిన సురేష్ ఇలా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. సురేష్ తమ తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు కాగా, తండ్రి జగన్నాథం గతంలో మరణించినట్లు తెలిపారు. అటు భర్త, ఇటు కుమారుడు మృతి చెందడంతో తల్లి దిక్కులేనిది అయ్యిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. సురేష్ మృతికి కారణాలు తెలియాల్సి ఉందని జీఆర్పీ పోలీసులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ఖుర్ధా జిల్లాలో.. 46,449 కేసులు పరిష్కారం



సహకరించిన న్యాయవాదులు



కేసు వివరాలు వింటున్న జిల్లా జడ్జి జగదీష్ ప్రసాద్ మహంతి



లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తులు



కేసులు పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి ప్రదీప్‌కుమార్ మహంతి



లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి షడంగి

భువనేశ్వర్: జాతీయ లోక్ అదాలత్‌ను ఖుర్ధా జిల్లాలో శనివారం నిర్వహించారు. జాతీయ న్యాయ సేవల అథారిటీ, ఒడిశా రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ ఆధ్వర్యంలో ఖుర్దా జిల్లా పరిధిలోని భువనేశ్వర్, ఖుర్ధా, బొణొపూర్, జట్నీ, టంగి, చిలికా, బెగునియాలోని అన్ని జ్యుడీషియల్ డివిజనల్ కోర్టు సముదాయాలలో లోక్ అదాలత్ నిర్వహించారు. విచారణ కోసం మొత్తం 76,437 కేసులు దాఖలవ్వగా వాటిలో 46,449 కేసులను న్యాయమూర్తులు పరిష్కరించారు. అలాగే జరిమానా, పరిష్కారం, ఆదాయం వర్గాల కింద రూ. 26,27,08,395 వసూలు చేయాలని నిర్ణయించారు. ఖుర్ధా జిల్లా సెషన్స్, జిల్లా న్యాయ సేవల అథారిటీ, భువనేశ్వర్ చైర్మన్ బిరంచి నారాయణ్ మహంతి, ఫ్యామిలీ కోర్టు జడ్జి మదన్‌లాల్ కేడియా, నరేష్ మహంతి, అదనపు జిల్లా జడ్జిలు హిమాన్షు శేఖర్ మల్లిక్, శుభంజన్ మహంతి, వందన కొరొ మరియు ఇతర సీనియర్ న్యాయ అధికారులు లోక్ అదాలత్‌లో పాలుపంచుకుని రికార్డు సంఖ్యలో కేసులను పరిష్కరించారు.



లోక్ అదాలత్‌కు హాజరైన కక్షిదారులు

లోక్ అదాలత్‌లో 7,142 కేసులు పరిష్కారం

జయపురం: స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా ప్రదీకరణల సూచనల మేరకు కొరాపుట్ జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ జయపురం వారు నిర్వహించిన లోక్ అదాలత్‌లో 7,142 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ విషయాన్ని ప్రదీకరణ అధికారులు వెల్లడించారు. జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షులు, జిల్లా జడ్జి ప్రదీప్ కుమార్ మహంతి అధ్యక్షతన జిల్లాలోని కొరాపుట్, కొట్‌పాడ్, లక్ష్మీపూర్, సెమిలిగుడ, దసమంతపూర్, బొరిగుమ్మ, లమతాపుట్ కోర్టులలో కూడా లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో 34 మోటార్ ప్రమాదాల కేసులు పరిష్కరించి బాధితులకు 2,05,20,000 రూపాయల పరిహారం సమకూర్చినట్లు వెల్లడించారు. అలాగే మిగతా 7,108 కేసులు పరిష్కరించి 4,58,50,538 రూపాయలను జరిమానా వసూలు చేశారు. కేసులు పరిష్కరించిన వారిలో కుటుంబ కోర్టు జడ్జి నిశిత్ నిశాంకో, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన, రిజిష్టర్ బిష్ణు ప్రసాద్ దేవత, సబ్‌డివిజన్ మెజిస్ట్రేట్ సంతోష్ కుమార్ బారిక్, ప్రథమ శ్రేణి విచారపతి అనిమేష్ జెన, ద్వితీయ శ్రేణి విచారపతి దీక్ష్యా రౌత్‌రాయ్, ప్రజ్ఞా సుమన్ మహాపాత్రో, జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరమ్‌శౌర్యారెడ్డితోపాటు కొరాపుట్ సబ్‌కలెక్టర్, తహసీల్దార్లు, న్యాయవాదులు కేసుల పరిష్కారానికి సహకరించారు.

లోక్ అదాలత్‌లో 119 కేసుల పరిష్కారం

రాయగడ: జిల్లా సివిల్ కోర్టు ప్రాంగణంలో శనివారం లోక్ ఆదాలత్ నిర్వహించారు. జిల్లా జడ్జి సత్యనారాయణ షడంగి ఆధ్వర్యంలో గుణుపూర్, రాయగడ, కాసీపూర్, పద్మపూర్, మునిగుడ, బిసంకటక్ కోర్టుల్లో దీర్ఘకాలంగా ఉన్న 119 కేసులను పరిష్కరించారు. కేసుల పరిష్కారంలో భాగంగా 39,51,396 రూపాయలను జరీమానాగా వసూలు చేశారు. అలాగే రెవెన్యూ కేసుల్లో భాగంగా 5,528 కేసులను, మరో ఏడు ప్రిలిటిగేషన్ కేసులను పరిష్కరించి 2,46,111 రూపాయలను జరిమానాగా వసూలు చేశారు.

1503 కేసులు పరిష్కారం

పర్లాకిమిడి: జిల్లా కోర్టులో 2వ జాతీయ, రాష్ట్ర లోక్ ఆదాలత్‌ను జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ అధ్యక్షుడు జగదీష్ ప్రసాద్ మహంతి ప్రారంభించారు. జాతీయ లోక్ ఆదాలత్‌లో శనివారం వివిధ జాతీయ బ్యాంకులు, జిల్లా సెషన్స్, ఫ్యామిలీ కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు. రాష్ట్ర జాతీయ లోక్ ఆదాలత్‌లో మొత్తం 1503 వివిధ కేసులు పరిష్కరించి రూ.21,82,950 జరిమానా వసూలు చేశారు. ఈ లోక్ ఆదాలత్‌లో జిల్లా సెషన్సు జడ్జి జగదీష్ ప్రసాద్ మోహనా, ఫ్యామిలీ కోర్టులో అశోక్ కుమార్ పహి, ఆదనపు జిల్లా సెషన్సు జడ్జి ప్రదీప్ కుమార్ సామల్, సంతోష్ కుమార్ అగర్‌వాలా (సివిల్ జడ్జి, సీనియర్ డివిజన్), రస్మితా సాహు ఉమెన్స్‌కోర్టు జడ్జి, బిమల్ రావుళో (జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి), వైశాలి బాహుబలేంద్ర (జ్యాడిషియల్ మాజిస్ట్రేటు, సెకండ్ క్లాస్), పుణ్యశ్లోక్ రథ్ (ఆర్.ఉదయగిరి), శుబాజిత్ బెహరా (మోహనా) ఫస్టుక్లాక్ మాజిస్ట్రేట్, మోనాలీ బెహరా, గ్రామన్యాయాఖాది, జ్యుడీషియల్ మాజిస్ట్రేట్, తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్‌లో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పర్యటన



డబ్లింగ్ లైన్ నిర్మాణ పనులు పర్యవేక్షిస్తూ..



పాడువా వద్ద రక్షణ గోడలను పరిశీలిస్తున్న జీఎం పరమేశ్వర్ ఫంకువాల్



అమృత్ భారత్ నిర్మాణాలు పరిశీలిస్తున్న జీఎం, డీఆర్‌ఎం



కొరాపుట్ రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న రైల్వే ఉన్నతాధికారులు

కొరాపుట్: ఈస్ట్ కోస్ట్ జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంకువాల్ కొరాపుట్ రైల్వే లైన్‌లో శనివారం పర్యటించారు. కొరాపుట్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేశారు. అమృత్ భారత్ కింద నిర్మితమవుతున్న భవనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రయాణికుల టాయిలెట్లు, వెయిటింగ్ హాల్, సిగ్నల్ రూం తదితర ప్రాంతాలకు వెళ్లారు. సుక్కు వద్ద నిర్మితం అవుతున్న డబల్ లైన్ వంతెన పరిశీలించారు. డార్లి స్టేషన్ వద్ద ట్రాక్ పనితీరుపై దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. పాడువ వద్ద రైల్వే ట్రాక్ పక్క కొండల పైనుండి రాళ్లు పడినప్పుడు అడ్డుకొనే రక్షణ గోడల పటిష్టతపై ఆరా తీశారు. పలు చోట్ల డబ్లింగ్ లైన్ ట్రాక్ నిర్మాణ పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో వాల్తేర్ డీఆర్‌ఎం లలిత్ బోరా, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ (కనస్ట్రక్షన్స్) ఆఫీసర్ అంకుష్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

● ఎం.బజార్ ప్రారంభం



ఎం.బజార్‌ను ప్రారంభిస్తున్న కాశీరాజు

పర్లాకిమిడి: కొత్తబస్టాండ్ రోడ్డులో శ్రీకృష్ణాసినిమా ప్రాంగణంలో ఎం.బజార్‌ను ప్రముఖ వ్యాపారవేత్త వైశ్యరాజు కాశీరాజు శనివారం ప్రారంభించారు. మూడు ఫ్లోర్లు కలిగిన ఈ బజార్‌లో రెడీమేడ్ వస్త్రాలు, ప్లాస్టిక్ సామాన్లు అమ్మకానికి ఉంచారు. ఈ ప్రారంభోత్సవంలో గజపతి జిల్లా సినీ ఎగ్జిబిటర్స్ సంఘం అధ్యక్షుడు వి.బాలాజీ రాజు, రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి



వృద్ధుడి మృతదేహం

కాశీబుగ్గ/ఇచ్ఛాపురం: పలాస జీఆర్పీ పరిధి ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ సమీపంలో బహుదా నది రైలు వంతెనపైన వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వ్యక్తి వంతెన దాటుతున్న తరుణంలో ఒక్కసారిగా రైలు రావడంతో ఎటుపోవాలో తెలియక ఉండిపోవడం వలన ప్రమాదం చోటుచేసుకుందని జీఆర్పీ పోలీసులు భావిస్తున్నారు. వృద్ధుడి వయస్సు 65-70 సంవత్సరాలు మధ్య ఉంటుందని, తెల్లని రంగు షర్టు పైన నిలువుగా నల్లని గీతలు, ఎర్రని లుంగీ కట్టుకున్నారని తెలిపారు. పలాస జీఆర్పీ ఎస్‌ఐ షరీఫ్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తుపడితే 94406 27567 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

దొంగతనం కేసులో బాలుడు అరెస్టు



పట్టుబడిన టైర్లు, ఇతర సామానులు

జయపురం: వాహన షెడ్‌లో టైర్లు, ఇంజిన్ సామానులు దొంగిలించిన బాలుడిని అరెస్టు చేసినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి ఉల్లాస చంద్ర రౌత్ శనివారం వెల్లడించారు. అతడిని జువైనల్ కోర్టులో హాజరుపర్చారు. కోర్టు ఆదేశాల మేరకు మల్కనగిరి బాలల రక్షణ గృహానికి తరలించినట్లు పట్టణ పోలీసు అధికారి వెల్లడించారు. నిందితుడి నుంచి దొంగిలించిన టైర్లు, ఇతర సమానులు స్వాధీన పరచుకున్నట్లు వెల్లడించారు. గాంధీ చౌక్‌లో గల ఒక నాలుగు చక్రాల షోరూమ్ గిడ్డంగిలో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. జనవరి 21వ తేదీన గిడ్డంగిలో ఉన్న నాలుగు కొత్త టైర్లు, రిమ్ములు దొంగతనానికి గురయ్యాయి. ఈ విషయం జనవరి 22వ తేదీన యజమాని తెలుసుకున్నాడు. ఆ షోరూమ్ యజమాని దొంగసంపై లిఖిత పూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగిలించబడిన వాటి విలువ రూ.50 వేలు ఉంటుందన్నారు. దొంగతనం సీసీ కెమారాలలో రికార్డు అయింది. పోలీసుల దర్యాప్తులో వివిధ సమయాలలో జరిగిన దొంగతనాలు సీసీ కెమెరాల ద్వారా తెలుసుకున్నారు గిడ్డంగి నుంచి ఇనుప రేంపులు, పలు రిమ్ములు, 50కి పైగా టైర్లు దొంగిలించబడ్డాయి. వాటి విలువ రూ.5 లక్షల 50 వేలకు పైనే ఉంటుందని షోరూమ్ యజమాని తెలిపారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపగా బాలుడిని వద్ద 4 టైర్లు, రిమ్ము, ఇతర వస్తువులు లభించాయని వెల్లడించారు. ఇంకా దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.


● కాసేపు విరామం.. బాలలతో మమేకం



ఎంతటి ఎంపీ అయినా తానూ ఒకప్పుడు బాలుడేనన్న సంగతి గుర్తుకు తెచ్చుకున్నారు నబరంగ్‌పూర్ ఎంపీ బలబద్ర మజ్జి. శనివారం కొరాపుట్ జిల్లా కొట్‌పాడ్‌లో పర్యటిస్తుండగా ఓ వీధిలో బాలలు గోలీలు ఆడటం గమనించారు. వెంటనే వారి వద్దకు వెళ్లి వారితో మాటలు కలిపి చేరువయ్యారు. వారితో కలిసి గోలీలు ఆడి బాల్యం గుర్తు చేసుకున్నారు. – కొరాపుట్

విద్యుత్ ఆదా... చేద్దాం పదా..!

● వేసవిలో పెరుగుతున్న విద్యుత్ వినియోగం
● స్వీయ నియంత్రణతో వృథాకు అడ్డుకట్ట



హిరమండలం: ప్రస్తుతం భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇలాంటి తరుణంలో ఏ ఇంట చూసినా ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం పెరుగుతోంది. వీటితో పాటు వాషింగ్ మిషన్లు, మిక్సీలు, కుక్కర్ల వంటి ఉపకరణాలను తప్పనిసరిగా వాడాల్సి వస్తోంది. ఫలితంగా ప్రతినెలా విద్యుత్ బిల్లుల మోత మోగుతోంది. అయితే బిల్లులు చూసి బెదిరిపోయే కంటే ముందుగానే విద్యుత్ పొదుపు పాటించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఉపకరణాల వాడకంలో ఆచుతూచి వ్యవహరిస్తే వృథా ఖర్చు తగ్గించుకోవచ్చని చెబుతున్నారు.

శ్రీకాకుళం జిల్లాలో...

జిల్లాలో సుమారుగా 6.71 లక్షల గృహ వినియోగ అవసరాల కోసమే దాదాపు 80 శాతం విద్యుత్ వినియోగం జరుగుతోంది. రోజుకు సుమారు 60 లక్షల యూనిట్లు వినియోగిస్తున్నారు. దీనిలో కేవలం లైటింగ్ కోసం 20 శాతం వాడుతున్నారు. ఈ విషయంలో కొంచెం పొదుపు పాటిస్తే వృథా ఖర్చు తగ్గుతుంది. సాధారణ బల్బులకు బదులుగా ఎల్ఈడీ రకం పెట్టుకుంటే బిల్లు తక్కువ వస్తుంది. పగటపూట లైట్లు అవసరం లేకుండా కిటికీలకు లేత రంగులుండే కర్టెన్లు వేస్తే కాంతి లోపలకు వస్తుంది.

గృహ అవసరాలకు బిల్లు ఇలా..

యూనిట్లు	యూనిట్‌కు చార్జీ (రూ.ల్లో)
0–30	3.25
31–75	4.00
76–125	4.50
126–225	6.00
226–400	8.75
400 పైన	9.75

పిల్లలకు నేర్పించండి

విద్యుత్ ఆదాపై తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలి. సెలవులు కావడంతో అవసరం మేరకు మాత్రమే ఉపకరణాల వాడకం, నియంత్రణ విధానాలు పాటించేలా చూడాలి. బడిలోనూ విరామ సమయాల్లో ఫ్యాన్లు, లైట్లు ఆపివేయాలని చెప్పాలి. ఇంట్లో కంప్యూటర్లు, టీవీలు ఎంత సమయం చూడాలి అవగాహన కల్పించాలి. చరవాణి, కెమెరాలకు అవసరం మేరకే చార్జింగ్ చేసుకోవాలి. రిఫ్రిజిరేటర్ డోర్ మాటిమాటికీ తీయకూడదని వారికి వివరించాలి.

ఇవి పాటించండి

- ఫ్రిజ్, గోడ మధ్య ఖాళీ ఉండేలా చూసుకోవాలి. లేకుంటే కంప్రెసర్ ఎక్కువగా పనిచేసి విద్యుత్ వృథాగా ఆస్కారం కలుగుతుంది.
- కొందరు వాషింగ్ మిషన్‌లో సామర్థ్యానికి మించి దుస్తులు వేస్తారు. అలాచేస్తే యంత్రం పనిచేసే సమయం పెరిగి కరెంట్ వాడకం ఎక్కువ అవుతుంది.
- టీవీ, కంప్యూటర్లు వాడకపోతే స్విచ్ఛాఫ్ చేయాలి.
- ఎలక్ట్రానిక్ పరికరాలు చార్జింగ్ పూర్తి కాగానే ప్లగ్‌ల నుంచి తొలగించాలి.
- ఎక్కువ చల్లదనం కోసం చాలామంది 18 డిగ్రీల వద్ద ఏసీ వినియోగిస్తుంటారు. అలా చేయకూడదు. ఎప్పుడూ 24 డిగ్రీల్లో ఉంచుకుంటే 20 శాతం విద్యుత్ ఆదా చేయగలం. గదిలో తలుపులు, కిటికీలు మూసిన తర్వాతే ఏసీ ఆన్ చేయాలి.
- మైక్రో ఓవెన్‌ను మాటిమాటికీ తీయకూడదు. అలాచేస్తే ఉన్న ఉష్ణోగ్రత తగ్గి తిరిగి వేడెక్కేందుకు మరింత సమయం పడుతుంది.
- ఆటోమెటిక్ ఆన్, ఆఫ్ విధానంతో పాటు 5 నక్షత్రాల ప్రమాణాలున్న ఉపకరణాలు కొనుగోలు చేయడం ఉత్తమం.

అవగాహన అవసరం



విద్యుత్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. అవసరం మేరకు మాత్రమే ఉపకరణాలు వాడాలి. స్వీయ నియంత్రణతో వృథా ఖర్చు తగ్గించుకోవచ్చు. విద్యుత్ ఆదా చేసేందుకు పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సౌర విద్యుత్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.
– జి.శంకర్‌రావు, విద్యుత్ శాఖ ఈఈ, టెక్కలి

క్లుప్తంగా

బెల్లం ఊట ధ్వంసం


పట్టుబడిన సారా

సీతంపేట: మండలంలోని జొనగనాయుడు గూడ గ్రామ పరిసరాల్లో ఎక్సైజ్ శాఖ జరిపిన దాడుల్లో 60 లీటర్ల సారా పట్టుకున్నట్టు ఎస్‌టీఎఫ్ ఎస్ఐ హనుమాన్ నాయక్ తెలిపారు. సారా వంట చేయడానికి సిద్ధం చేసిన 2560 లీటర్ల పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేశామన్నారు. సవర బాలరాజు పట్టుబడగా, సవర వెంకయ్య, బాలయ్య, రవికుమార్‌లు పరారైనట్టు తెలిపారు. సారా తయారీకి బెల్లం సరఫరా చేసే సీతంపేటకు చెందిన బుడ్డీ నాగేశ్వరరావును అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. 1950 కిలోల నల్లబెల్లం స్వాధీనం చేసుకున్నామన్నారు.

చీటింగ్ కేసు నమోదు

సీతంపేట: ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన చిరంజీవిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. రేగులగూడకు చెందిన రాజ్‌కుమార్ తీర్థయాత్రలకు గ్రామస్తులతో పాటు వెళ్లడానికి రూ.97 వేలు ఆరు నెలల క్రితం ఫోన్ పే ద్వారా ట్రావెలర్‌కు చెల్లించారు. ఎప్పటికీ టూర్ తీసుకువెళ్లలేదు. దీంతో నగదు మొత్తాన్ని తిరిగి ఇప్పించాలని స్థానిక పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వై.అమ్మన్నరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఐదుగురిపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని తాలాడ గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. ఈ నెల 3వ రాత్రి వడ్డి వెంకటలక్ష్మి కుటుంబానికి, అదే గ్రామానికి నేతల తవుడు కుటుంబానికి తగదా జరిగింది. తర్వాత 5వ తేదీన తన కుమారుడుతో నేతల తవుడు గొడవ పడుతుండడంతో వెంకటలక్ష్మి అక్కడకు వెళ్లడంతో ఆమెను అసభ్యకర పదజాలంతో తిట్టి దూషించాడు. గ్రామ పెద్దల వద్ద సమస్య పరిష్కారం కాకపోవడంతో శనివారం వెంకటలక్ష్మి ఫిర్యాదు చేయడంతో ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రయించిన వ్యక్తి అరెస్టు


చీపురుపల్లి రూరల్(గరివిడి): గంజాయితో పట్టుబడిన వ్యక్తి

చీపురుపల్లి రూరల్ (గరివిడి): దొంగతనంగా గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన వ్యక్తికి చీపురుపల్లి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు 14 రోజుల రిమాండు విధించినట్లు గరివిడి ఎస్ఐ బి.లోకేశ్వరరావు తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు ఇద్దరు మధ్యవర్తులతో కలిసి గరివిడి ఇందిరమ్మ కాలనీకి సమీపంలో ఉన్న మామిడితోట వద్దకు వెళ్లామని, గంజాయి అమ్మడానికి వచ్చే వ్యక్తి పోలీస్ వాహనాన్ని చూసి పారిపోవటానికి ప్రయత్నించారని తెలిపారు. పోలీస్ సిబ్బందితో కలిసి సదరు వ్యక్తిని పట్టుకుని తనిఖీ చేయగా అతని వద్ద 1500 గ్రాముల గంజాయి దొరికిందని తెలిపారు. ఒడిశా బోర్డర్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి తీసుకువచ్చి చీపురుపల్లి, గరివిడి ప్రాంతాల్లో అమ్ముతున్నట్టు తెలియజేశాడని, 1500 గ్రాముల గంజాయిని స్వాధీనపరుచుకుని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామని తెలిపారు. సీఐ జి.శంకరరావు వ్యక్తిని అరెస్టు చేసి కోర్టుకు పంపించగా 14 రోజులు రిమాండు విధించారని తెలిపారు.

పట్టుబడ్డ గంజాయి

కొమరాడ: మండలంలోని కూనేరు చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా శనివారం ఆటో ఓ వ్యక్తి గంజాయి తీసుకుని వెళ్తుండగా పట్టుబడినట్టు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయిపూర్‌కి చెందిన శివరాజ్ యాదవ్ ఆటోలో ప్రయాణం చేస్తుండగా కూనేరు వద్ద 4.150 కేజీలు గంజాయి దొరకడంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచామని చెప్పారు.

యువకుడి ఆత్మహత్య


మృతుడు దొరబాబు (ఫైల్)

గంట్యాడ: ఒంటికి నిప్పంటించుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొండతామరాపల్లి గ్రామానికి చెందిన కోరాడ దొరబాబు(21) శుక్రవారం రాత్రి ఇంట్లో తన గదిలో రెండు వైపులా గడియ పెట్టి ఉడ్ పాలిష్ టిన్నర్ ఒంటిపై వేసుకొని నిప్పంటించుకున్నాడు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు తలుపులు తెరచి చూడగా మృతి చెంది ఉన్నాడు. దొరబాబు తల్లి ఇటీవల మృతి చెందడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ డి.సాయికృష్ణ శనివారం శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కళలకు ఆదర్శం నాటికలు

- ఆహ్వాన నాటిక పోటీల్లో సినీనటి జయలలిత, నరసింహారాజు
- పాల్గొన్న పలువురు సినీ ఆర్టిస్టులు


ఆహ్వాన నాటిక పోటీల కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీనటి జయలలిత

చీపురుపల్లి రూరల్(గరివిడి): నాటికలు కళలకు ఆదర్శమని సినీ నటి జయలలిత అన్నారు. గరివిడిలోని శ్రీరాం హైస్కూల్ ఆవరణలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సినిమాలు కంటే నాటికల్లో నటించేవారు గొప్ప కళాకారులు అని అభివర్ణించారు. సినిమాల్లో కటింగులు, టేక్ ఆఫ్‌లు ఉంటాయని, నాటికల్లో ప్రదర్శనంతా ఒకే వేదికపై ఇవ్వాల్సి ఉంటుందని, నాటికల్లో నటించే వారే అసలైన కళాకారులని అన్నారు. కళలు బతికుండాలంటే నాటికలను ప్రోత్సహించాలన్నారు. ఉభయ రాష్ట్రాల స్థాయిలో జరుగుతున్న ఈ ఆహ్వాన నాటిక పోటీలకు తనను ఆహ్వానించినందుకుగాను కృతజ్ఞతలు తెలిపారు. సినీ నటుడు నరసింహారాజు మాట్లాడుతూ ఇలాంటి మంచి నాటిక రంగాన్ని ప్రోత్సహించాలని, ప్రతీ ఏడాది గరివిడిలో ఇలాంటి సాంస్కృతిక నాటిక కార్యక్రమాలు అలరించాలన్నారు. గరివిడి ప్రాంతానికి ఈ కార్యక్రమాలు మంచి గుర్తింపును తీసుకువస్తాయన్నారు. గరివిడి కల్చరల్ అసోషియేషన్ ప్రతినిధులు వాకాడ గోపి, రవిరాజ్, బమ్మిడి కార్తీక్, కంబాల శివ, వాకాడ శ్రీనివాసరావు, ఉప్పు శ్రీను తదితరుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆహ్వాన నాటిక పోటీల కార్యక్రమంలో చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులుతో పాటుగా అతిథులుగా జాలాది విజయ, బలివాడ రమేష్, సినీ ఆర్టిస్ట్ రవితేజ, అరుణ తదితరులు హాజరయ్యారు.


నాటిక పోటీలను తిలకించేందుకు విచ్చేసిన ప్రేక్షకులు


చిగురు మేఘం నాటికలో ఓ సన్నివేశం

సందేశాత్మక నాటికలు

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా గరివిడి శ్రీరాం హైస్కూల్ ఆవరణంలో గరివిడి కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రెండో రోజు శనివారం ప్రదర్శించిన నాటికలు సందేశాత్మక వివరణతో ఎంతగానో ఆకట్టుకున్నాయి. గుంటూరుకు చెందిన అమరావతి ఆర్ట్స్ వారు ప్రదర్శించిన చిగురు మేఘం నాటిక ప్రేక్షకులను కట్టిపడేసింది. ఉన్నత చదువులైన మెడిసిన్ పూర్తి చేసి డాక్టర్‌లుగా ఎదిగి పట్టణాల్లో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ధనార్జన ధ్యేయం కాకుండా గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలు అందించి ప్రజలను కాపాడటమే వైద్యుడి ప్రధాన కర్తవ్యం అన్న సారాంశంతో చిగురు మేఘం నాటిక ముగుస్తుంది. హైదరాబాద్ కళాంజలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన రైతేరాజు నాటిక మంచి సారాంశాన్ని అందించింది. గుండెసూది నుంచి విమానం వరుకు ఏ వస్తువు తయారీ చేసిన వస్తువు రేటు నిర్ణయిస్తున్నారు. రైతేరాజు, దేశానికి వెన్నెముకగా ఉన్న రైతు పండించిన పంటకు రేటు నిర్ణయించుకునే హక్కు లేదు. రైతుకు గుండె మండి వ్యవసాయానికి సెలవు ప్రకటిస్తే ఏమి తిని బ్రతుకుతారు, రైతుల గోడు పట్టించుకోమని చెప్పే సారాంశంతో నాటిక సమాప్తం అవుతుంది. అదే విధంగా పాలకొల్లుకు చెందిన నటీనట సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రదర్శించిన అనూహ్యం నాటిక ఆకట్టుకుంది. కొడుకులు వారసత్వ సంపదను అనుభవించటం కోసం ఎదురు చూడకుండా స్వయంకృషితో జీవించాలనే సందేశంతో అనూహ్యం నాటిక ముగుస్తుంది.


అనూహ్యం నాటికలో ఓ సన్నివేశం

నెల్లిమర్లలో టీడీపీ X బీజేపీ

- చిచ్చు రేపిన అన్న క్యాంటీన్ వ్యవహారం
- ఇటీవల లోపాలు ఎత్తిచూపిన బీజేపీ నేతలు
- మండిపడ్డ టీడీపీ శ్రేణులు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు క్షమాపణలు చెప్పాలని డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు రవిశేఖర్, రాజారావు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల కూటమిలో ఊహించని రీతిలో చిత్ర విన్యాసాలు జరుగుతున్నాయి. ఇప్పటికే టీడీపీ–జనసేన మధ్య విబేధాలు తారాస్థాయికి చేరుకున్న సంగతి తెలిసిందే. తాము అనుకున్నట్టు ఏదీ జరగడం లేదని టీడీపీ నేతలు తీవ్ర నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా ఈ మధ్యనే బీజేపీ నేతలు కూడా టీడీపీపై యుద్ధం ప్రకటించడంతో టీడీపీ శ్రేణుల కోపం కట్టలు తెంచుకుంది. వివరాల్లోకి వెళ్తే... ఇటీవల నెల్లిమర్ల మండల కేంద్రంలో ఉన్న అన్న క్యాంటీన్‌లో నిర్వహణ సక్రమంగా లేదంటూ వైఎస్సార్‌సీపీ నుంచి బీజేపీలోకి జంప్ అయిన కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ ఆరోపిస్తూ కొంతమంది జనసేన, బీజేపీ నేతలతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో అన్న క్యాంటీన్‌లో అవకతవకలు జరుగుతున్నాయని, పేదలకు అందాల్సిన ఆహారం పక్కదారి పడుతోందని ఆరోపించారు. అయితే ప్రజా సమస్యలపై ఇలానే పోరాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్ వర్మ కౌన్సిలర్ ప్రసాద్‌ను ప్రోత్సహించడంపై టీడీపీ నేతలు తీవ్ర స్థాయిలో స్పందించారు. పొత్తు ధర్మాన్ని విస్మరిస్తున్నారని, వెంటనే క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు.

క్షమాపణలు చెప్పాలి..

నెల్లిమర్లలో అరాచక శక్తులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ ప్రోత్సహించడం సరికాదని టీడీపీ రాష్ట్ర పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బీజేపీ నేతలకు వ్యతిరేకంగా శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నిరుపేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అన్న క్యాంటీన్లను నిర్వహిస్తోందని బీజేపీ నేతల ఆరోపణలు అవాస్తవమన్నారు. ఆరోపణలు చేసిన నాయకుడి పూర్వపరాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు తెలుసుకోవాలని హితవు పలికారు. రాజకీయ లబ్ధి కోసం పొత్తు ధర్మాన్ని విస్మరిస్తూ అవాకులు, చెవాకులు మాట్లాడడం సరికాదని, క్షేత్ర స్థాయిలో నిజాలు తెలుసుకోకుండా సదరు నాయకుడిని ఎలా ప్రోత్సహిస్తారని ప్రశ్నించారు. ఆరోపణలు చేసిన బీజేపీ నాయకుడిని తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, ప్రోత్సహించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అవనాపు సత్యన్నారాయణ, కింతాడ కళావతి, బైరెడ్డి నాగేశ్వరరావు, రెడ్డి వేణు, కాళ్ల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మూడవ నేషనల్ తైక్వాండో సెమినార్ రేపు


మాట్లాడుతున్న జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

విజయనగరం : జిల్లా తైక్వాండో అసోసియేషన్ సారథ్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు విజయనగరం రాజీవ్ స్టేడియంలో మూడవ నేషనల్ తైక్వాండో సెమినార్ జరగనుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్.వేణుగోపాలరావు తెలిపారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. నాలుగు రోజుల పాటు విదేశాల నుంచి వచ్చే శిక్షకులచే అతిథ్య ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, ఒడిశా, తమిళనాడు, తెలంగాణ, పాండిచ్చేరి తదితర రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. సెమినార్‌లో ఇరాన్ దేశానికి చెందిన అబ్బాస్ షేక్ ట్రైనర్‌గా వ్యవహరించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సెమినార్ మొదటి రోజు సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుందని వివరించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఈ సెమినార్‌ల పాల్గొనవచ్చని తెలిపారు.

ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

- తొమ్మిది బైక్‌ల స్వాధీనం
- నెల్లిమర్లలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీనివాసరావు


నిందితులను మీడియా ముందు ప్రవేశ పెట్టిన డీఎస్పీ శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: వాళ్ల కన్నుపడితే చాలు ఏ బండైనా క్షణాల్లో మాయమవ్వాల్సిందే. బైకు చోరీలకు పాల్పడడం.. మీ సేవ సహకారంతో ఆన్‌లైన్‌లో లేని నంబర్లను వెతికి నంబరు ప్లేట్లను మార్చడం.. వీళ్లకి వెన్నతో పెట్టిన విద్య. అలా నంబరు ప్లేట్లను మార్పు చేసి అతి తెలివిగా బంధువులకు, స్నేహితులకు తక్కువ సొమ్ముకే తనఖాకు పెట్టి జల్సాలు చేయడం వాళ్లకి నిత్యకృత్యం. జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు విజయవాడ, కశింకోట ప్రాంతాల్లో కూడా ఇదే తరహాలో బైక్ చోరీలకు పాల్పడ్డారు. అనుమానం రాకుండా దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును నెల్లిమర్ల పోలీసులు ఎట్టకేలకు రట్టు చేశారు. చోరీలకు పాల్పడుతున్న నెల్లిమర్ల మండలం పెద్ద బూరాడపేట, చిన్న బూరాడపేట గ్రామాలకు చెందిన ఇద్దరి నిందితులను అదుపులోకి తీసుకొని వారి నుంచి తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లిమర్ల ఎస్ఐ గణేష్ తన సిబ్బందితో కలిసి బూరాడపేట జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అదే సమయంలో పెద, చిన బూరాడపేట గ్రామాలకు చెందిన బెల్లాన చంద్రశేఖర్, దన్నాన సూరిబాబు ద్విచక్ర వాహనంపై వస్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిపై అనుమానంతో అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా తొలుత రెండు బైకులను చోరీ చేసినట్లు అంగీకరించారు. ఇటీవల ద్విచక్ర వాహనాలు మాయమవుతున్నట్టు ఎక్కువగా ఫిర్యాదులు రావడంతో తమదైన శైలిలో పోలీసులు విచారణ చేయగా నెల్లిమర్ల మండల పరిధిలో 2, గజపతినగరం పరిధిలో 1, విజయవాడ సిటీ పరిధిలో 4, గుర్ల పరిధిలో 1, కశింకోట పరిధిలో ఒకటి చొప్పన మొత్తం 9 బైకులను చోరీ చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి తొమ్మిది ద్విచక్ర వాహనాలను రికవరీ చేసి ఇద్దరి నిందితులను రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ తెలిపారు. ఆయా పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను పరిశీలించి నిబంధనల ప్రకారం బాధితులకు వాహనాలు అప్పగిస్తామన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన సిబ్బందిని ఆయన అభినందించారు. సీఐ జి.రామకృష్ణ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్, పక్కన ఎమ్మెల్యే బేబీనాయన, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

రామభద్రపురం: యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయనున్నట్టు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. మండలంలోని కొట్టక్కి రెవెన్యూ పరిధిలోని మిర్తివలస మధుర గ్రామం కాకర్లవలస వద్ద ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కోసం ఎమ్మెల్యే బేబీనాయన, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులతో కలిసి శనివారం ఆయన శంకుస్థాపన చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఎకరాలలో రూ.7 కోట్లతో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజల జీవన ప్రమాణాల మెరుగు కోసం రాష్ట్రంలో రానున్న రెండేళ్లలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయనున్నమన్నారు. ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ పారిశ్రామిక రంగంలో కొత్త విధానమని, తక్కువ మొత్తానికే చిన్న పారిశ్రామిక వేత్తలకు లీజుకు ఇస్తామని తెలిపారు. దీని కోసం 95 శాతం రుణాలు ఎటువంటి ఆస్తుల గ్యారంటీ చూపకుండా మంజూరు చేసేలా బ్యాంకర్లకు ప్రభుత్వం సుమారు రూ.150 వేల కోట్లు అందజేసిందన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రతి కుటుంబ నుంచి ఒక వ్యాపారవేత్త రావాలని పిలుపునిచ్చారు. రామభద్రపురం అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్ కోసం శీతల గోదాం ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. బుడాచైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, జెడ్పీటీసీ సభ్యులు అప్పికొండ సరస్వతి, ఆర్డీవో రామ్మోహనరావు, తహసీల్దార్ సులోచనరాణి, ఎంపీడీవో రత్నం తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఐదుగురు అరెస్ట్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద విజయరామపురం గ్రామ సమీపంలోని ఉన్న చంపావతి నదీ తీరంలో గంజాయి సేవిస్తున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. గంజాయి సేవిస్తున్నట్టు అందిన ముందస్తు సమాచారంతో రెవెన్యూ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని ఎస్ఐ గణేష్ తెలిపారు. నదీ తీరంలో తుప్పల చాటున గంజాయి సేవిస్తున్న ఐదుగురు యువకులను అరెస్ట్ చేసి వారి నుంచి 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అందరూ చదువుకున్న వారేనని, ఒడిశా రాష్ట్రంలోని రాయఘడ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. కాలేజీ చదువుతున్న సమయంలో చెడు అలవాట్లకు లోనై గంజాయి సేవించడం అలవాటు చేసుకున్నారని తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రేడింగ్ పేరిట నయా మోసం

- సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసిన
- బాధిత మహిళ

పార్వతీపురం రూరల్: మండలంలోని పుట్టూరు గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి ట్రేడింగ్ పేరిట సైబర్ మోసానికి గురైనట్లు శనివారం పార్వతీపురం రూరల్ ఎస్ఐ బి.సంతోషికుమారి పేర్కొన్నారు. గతేడాది ఏప్రిల్ నెలలో బాధిత మహిళ ఫోన్‌కు వచ్చిన మెసేజ్ మేరకు అరోరా ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట పెట్టుబడులు పెడితే ప్రోత్సాహకాలు నగదు రూపంలో వస్తాయని నమ్మించారు. బాధిత మహిళ ఆశపడి ఏడాది కాలంలో రూ.67,500లు పెట్టుబడి పెట్టగా నెలలు గడుస్తున్నా తనకు చెప్పిన ప్రకారం ప్రోత్సాహక నగదు చెల్లించకపోవడంతో ట్రేడింగ్ సిబ్బందిని ప్రశ్నించారు. వారు తప్పించుకొనే ప్రయత్నంలో భాగంగా సంబంధించిన గ్రూపుల నుంచి బాధిత మహిళను తొలగించడంతో మోసానికి గురైనట్టు గమనించిన బాధితురాలు సైబర్ పోర్టల్ 1930 నంబరుకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంతోషి మాట్లాడుతూ అవగాహన లేకుండా గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చిన మెసేజ్‌లకు, లింక్‌లకు స్పందించవద్దని, స్పందించిన కారణంగా సైబర్ మోసానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆమె అన్నారు.

అవాస్తవాలు పోస్టుచేస్తే చర్యలు

- సోషల్ మీడియాలో బాధ్యతగా వ్యవహరించాలి
- కుల, మత, ప్రాంతాల పట్ల విద్వేషాలు సృష్టించే పోస్టులు పెట్టొద్దు
- ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి



పార్వతీపురం రూరల్: సామాజిక మాధ్యమాల్లో ప్రతిఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని, ఏదైనా సందేశం ఫార్వర్డ్, పోస్టుచేసే ముందు వాస్తవమైనదా? కాదా? అన్నది నిర్ధారణ చేసుకున్నాకే షేర్ చేయాలని ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి సూచించారు. అలజడులు సృష్టించేలా, మనోభావాలు దెబ్బతినేలా పోస్టులు పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తన కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం, టెలిగ్రామ్, యూట్యూబ్, ఎక్స్(ట్విట్టర్) తదితర సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టే వారిపై శాఖాపరంగా ప్రత్యేక దృష్టిని సారించామన్నారు. తప్పుడు సమాచారం పోస్టుచేస్తే ఆయా గ్రూపులకు సంబంధించిన అడ్మిన్లు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అత్యవసర సమయాల్లో సమన్వయంతో వ్యవహరించాలన్నారు. మతపరమైన సున్నిత అంశాల్లో వచ్చిన వదంతులు, అవాస్తవాలను సామాజిక మాధ్యమాల ద్వారా శాంతిభద్రతలకు భంగం కలిగించేలా పోస్టులు పెట్టరాదన్నారు.

యువత సహకారం అందించాలి

భారత్–పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకొన్న నేపథ్యంలో యువత బాధ్యతగా వ్యవహరిస్తూ త్రివిధ దళాలకు, కేంద్ర బలగాలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనలకు సహకరించే విధంగా సహాయ సహకారాలు అందించాలని ఎస్పీ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతీపౌరుడు ఒక సైనికుడిలా వ్యవహరించాలన్నారు. ఇలాంటి సమయాల్లో ర్యాలీలు, ఆందోళనలు, ధర్నాలు వంటి కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. పోలీస్ ఆదేశాలను మీరితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఏనుగుల గుంపు విధ్వంసం


పొలంలో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస రూరల్: గరుగుబిల్లి మండలం నందివానివలస, సుంకి, తోటపల్లి గ్రామాల మధ్య నాలుగురోజులుగా సంచరిస్తున్న అటవీ ఏనుగుల గుంపు ఆదివారం రాత్రి కుదమ పంచాయతీ గౌరీపురం చెరకు, వరి పంట పొలాల్లో విధ్వంసం సృష్టించాయి. పంటను మొత్తం నాశనం చేయడంతో రైతులు యోగి రెడ్డి కైలాసరావు, శంబంగి లక్ష్మనాయుడు, అంబటి రాంబాబు, దత్తి వెంకటనాయుడు, రమేష్, తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు పంటను పరిశీలించి పరిహారం అందజేయాలని కోరారు. ఏనుగుల సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

నాయకమ్మగూడలో మలేరియా

సీతంపేట: మండలంలోని నాయకమ్మగూడలో ఆరు మలేరియా పాజిటివ్ కేసులు నమోదైనట్టు దోనుబాయి పీహెచ్‌సీ వైద్యాధికారి భానుప్రతాప్ తెలిపారు. ఇటీవల గ్రామానికి చెందిన బాలుడు జ్వరంతో అస్వస్థతకు గురై మృతిచెందడంతో వైద్య సిబ్బంది శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. 129 మందికి రక్తపూత పరీక్షలు చేశారు. మలేరియా పాజిటివ్ వచ్చినవారికి అవసరమైన మందులు అందజేసినట్టు వైద్యాధికారి తెలిపారు.

20న దేశ వ్యాప్త సమ్మె

- కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల ఐక్య వేదిక పిలుపు


దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిస్తున్న కార్మిక సంఘ నేతలు

విజయనగరం గంటస్తంభం: లేబర్ కోడ్‌ల రద్దు, ఎనిమిది గంటల పని దినం, కనీస వేతనం రూ.26,000, సమాన పనికి సమాన వేతనం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ తదితర డిమాండ్లపై ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల వేదిక నాయకులు పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్ అధ్యక్షతన స్థానిక జెడ్పీ మినిస్టీరియల్ భవనంలో జిల్లా సదస్సు శనివారం జరిగింది. సదస్సు ప్రారంభానికి ముందు ఇటీవల పహల్గాం ఉగ్ర దాడిలో మరణించిన వారికి, భారత ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ సిందూర్‌లో మరణించిన వీర జవాన్లకు రెండు నిమిషాలు మౌని పాటించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మిక వర్గం మీద బహుముఖ దాడి చేపట్టిందన్నారు. 95 శాతంగా ఉన్న కార్మికులకు తీవ్ర నష్టం చేకూర్చే విధంగా కార్మిక చట్టాలు, హక్కులపై దాడి జరుగుతుందన్నారు. కార్మికులకు ప్రశ్నించే హక్కు లేకుండా, పని గంటలతో సంబంధం లేకుండా బానిసలుగా చేసే పరిస్థితి నేడు మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిందని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను, సమ్మె చేసే హక్కును, కనీస వేతనాలు సాధన కోసం, ప్రభుత్వ రంగాన్ని కాపాడేందుకు ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సదస్సులో ప్రజా సంఘాల, కార్మిక సంఘాల నాయకులు తమ్మినేని సూర్యనారాయణ, వెంకటేశ్వరావు, శంకరరావు, ఈశ్వరరావు, రవికుమార్, గీత, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.